వద్దన్న వారికి టికెట్ ఇస్తున్నందుకు రాజీనామా

విశాలాంధ్ర - అమలాపురం : వైఎస్ఆర్సిపి అధిష్టానం తమకు గౌరవం ఇచ్చినా స్థానిక నాయకత్వం తమను ఇబ్బందులకు గురిచేయడం తమను రాజ కీయంగా అణచివేస్తున్న వారికే మళ్ళీ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని చూడటాన్ని భరించలేక వైఎస్ఆర్సిపి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శెట్టిబలిజ యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. బుధవారం ఆయన స్వగృహ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సుభాష్ ఉద్వేగంగా మాట్లాడారు. పదేళ్ళ జగన్ నాయకత్వంలోని వైసీపీ పార్టీ కోసం కోట్లు ఖర్చు పెట్టి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తే తన తల్లికి మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని స్థానిక నాయకత్వం మోసం చేసి తనను కేసుల్లో ఇరికించిందని సుభాష్ ఆవేదన చెందారు. తాను పార్టీకి ఎంత సేవ చేసినా స్థానిక నాయకత్వం సంబంధంలేని కేసుల్లో ఇరికించి ఇబ్బందుల పాలు చేసిందన్నారు. అమలాపురం కేసుల్లో తాను లేకున్నా తనతో పాటు వందలాది మందిని జైలు పాలు చేసారని ఈ విషయాలన్నీ అధిష్టానం మిదున్ రెడ్డికి తెలిపితే తనను ఓదార్చారు తప్ప వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదని సుభాష్ ఆందోళన చెందారు.

రా...కదలి రా విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జనసేన ఇన్‌చార్జిపితాని బాలకృష్ణ, గదుల సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ వైయస్సార్ ప్రభుత్వం మీద పోరాటంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్లమెంటు పరిధిలోని మండపేట నియోజకవర్గంలో సమావేశం ఏర్పాటు చేయడమైనది, కావునా జనసైనికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ (బాబి), పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, మందాల గంగ సూర్యనారాయణ, అత్తిలి బాబూరావు, కట్టా త్రిమూర్తులు, వెంటపల్లి ఉమామహేశ్వరి, ముత్యాల జయలక్ష్మి పెమ్మాడి కృష్ణవేణి, నడింపల్లి వినోద్, రోళ్ళ చక్రవర్తి నిమ్మకాయల మూర్తి, మోపూరి వెంకటేశ్వరరావు, యంపిటిసి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సర్పంచులకు శిక్షణ

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు బుధవారం సర్పంచులు ఎంపిటిసిలకు ఫ్రంట్ లైన్ వర్కర్స్ మరియు సచివాలయ సిబ్బందికి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణా కార్యక్రమం జరిగిందని పంచాయతీ విస్తరణ అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులను శానిటేషన్, సురక్షిత మంచినీరు కొరకు సాధారణ నిధులు కలుకొని 25% ఖర్చు చేయాలని శిక్షణలో పేర్కొన్నామని తెలిపారు. మిగిలిన నిధులను ఇతర అంశాలకు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే అప్పారావు, సూపరిడెంట్ గుత్తుల భీమశంకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్ పై ఓటర్లకు తర్ఫీదు

విశాలాంధ్ర - కరప : ప్రభుత్వ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కరప మండలంలో 66 పోలింగ్ బూత్లలో ఈవీఎం మిషన్లతో ఓటరులకు తర్ఫీదును ఇచ్చినట్టు తహసీల్దార్ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ యంత్రాలలో ఓటు వేసేందుకు ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ఈవీఎం యంత్రాలు ఉపయోగించి ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని దీనిపై 66 బూత్‌లలో వచ్చే నెల 9వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఆర్ఐ మాచరరావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

37వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర - జగ్గంపేట : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు తలపెట్టిన నిరవధిక సమ్మె బుధవారం 37వ రోజుకి చేరుకుంది. నిరసన కార్యక్రమాల్లో భాగంగా జగ్గంపేటలో ర్యాలీ నిర్వహించి సిడిపిఒ పూర్ణిమకి అంగన్వాడిలు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా చేస్తున్న మాపై ఎస్మా ప్రయోగించడం తగదన్నారు. పండుగ రోజున కూడా సమ్మె చేయడం చాలా బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, రత్నం, రాజేశ్వరి, రామ్ లీలా తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయలు జయంతి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రభోజ శ్రీకృష్ణదేవరాయలు వారి 553వ జయంతిని స్థానిక శుభం కాపు కళ్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయల వారి చిత్రపటానికి సంస్థ అధ్యక్షులు బసవా ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడు సలాది వీర వెంకట సత్యనారాయణ మూర్తి పూలమాలతో అలంకరించగా, సభ్యులంతా పూలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. సంస్థ పెద్దలు మాట్లాడుతూ విజయనగర చక్రవర్తిగా విశ్వవిఖ్యాతి గావించారని, వారి సంస్థానంలో కవి పండితులకు ప్రత్యేక స్థానం కల్పించారని, తెలుగు భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ. దేశభాషలందు తెలుగులెస్స అని నినదించారు. ఈకార్యక్రమంలో మాధవరపు పట్టాభిరామయ్యా, సేతు మాధవరావు, జల్ద్ రంగనాయకులు, బాజిబోయిన వెంకటేష్ నాయుడు, దామిశెట్టి శ్రీనివాస్, రెడ్నం రాజా, బావిరెడ్డి నిరంజన్ నాయుడు, కర్ణాసుల సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, నూకలు బలరాం, యళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులకు అంగన్వాడీల వివరణ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తమ సమస్యల పరిష్కారానికి గత 37 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన షోకజ్ నోటీసులకు రాతపూర్వకంగా ఐసిడిఎస్ పిఓలకు బుధవారం సమాధానమిచ్చారు. ఈ మేరకు ప్రత్తిపాడు ధర్నా శిబిరం వద్దకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషు బాబ్జి, ప్రత్తిపాడు కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, అంగన్వాడీల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దడాల పద్మ, ఇ చంద్రావతి చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించక పోగా రెచ్చగొట్టే ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కరించకపోతే సమ్మె మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ఊరేగింపుగా సెక్టార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత, అల్లాడి లక్ష్మి, సిహెచ్ హేమలత, యు మరియ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కరపత్రాల పంపిణీ

విశాలాంధ్ర - మామిడికుదురు : ఆమ్ ఆద్మీ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ రాజోలు నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట కాళేశ్వరరావు అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాజోలు నియోజక వర్గంలోనీ పలు గ్రామాల్లో పార్టీ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి రావాలంటే ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయండి

- కమిషనర్ నాగ నరసింహారావు

- వివిధ విభాగాధిపతులతో సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : రానున్న 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం అన్ని విభాగాధిపతులతో సమీక్షిం చారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలు, 2024-25 బడ్జెట్ అంచనాల పై అధికారులతో చర్చించారు. ఈనెల 20వ తేదీ నాటికల్లా ప్రతిపాదనలను పూర్తిచేసేలా ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి సత్యకుమారి, కార్యదర్శి ఎం ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఏసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, ఏవో శిరీష్, ఈఈ మాధవి, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు

కందికుప్పలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని కందికుప్ప కళా వెంకటరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో 1986-87 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు కలుసుకొని పాత జ్ఞాపకాలని తలచుకొని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమం గుదే వెంకటేశ్వరరావు, కందికట్ల శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పూర్వపు విద్యార్థులు ఎడ్ల సురేష్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు కె. భారతి పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తాడి నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు వడ్డీ శ్రీనివాసరావు, డ్రాయింగ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడి నాగేశ్వరరావు మాట్లాడుతూ 1986-87 బ్యాచ్ ఎంతో క్రమశిక్షణతో చదువుకున్నారని నేడు వివిధ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొంది తమకళ్ళ ఎదుటే ఉద్యోగస్తులుగా చూడటం ఎంతో ఆనందంగా ఉందనిపూర్వ విద్యార్థిని విద్యార్థులను ఆశీర్వదించారు. వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొంది ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు పూర్వపు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పరిచయాలు చేసుకున్నారు. గతంలో మరణించిన 14 మంది విద్యార్థుల చిత్రపటాలకు నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అతిథులైన ఉపాధ్యాయులకు సన్మానాలు ఘనంగా నిర్వహించారు. రానున్న రోజుల్లో కందికుప్ప హైస్కూల్‌కు తమ బ్యాచ్ తరపున సహాయ సహకారాలు త్వరలోనే అందిస్తామని పూర్వ విద్యార్థుల బృందం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కే శంకర్రావు, ప్రధానోపాధ్యాయురాలు కే భారతి, పరం కంప్యూటర్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వై సురేష్ కుమార్, జీ వెంకటేశ్వరరావు, వీఆర్వో ఎస్వీ రమణ, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కెఎస్ రావు, వెటర్నరీ డిపార్ట్మెంట్ కెవి రమణ, జి శ్రీను, గంపల సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని యస్. ముప్పవరం గ్రామానికి చెందిన జాన సత్యనారాయణ గౌడ్ తన అనుచరులు మరియు తన స్నేహితులతో కలిసి 15 మంది వివిధ పార్టీల నుండి జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి రామారావు సమక్షంలో బుధవారం జనసేనలోకి చేరారు. జనసేన ఆశయాలు నచ్చి టి.వి. రామారావు అడుగుజాడల్లో నడిచి, రానున్న ఎన్నికల్లో జనసేన విజయానికి కీలకంగా ఉంటామని హామీ ఇచ్చారు అని , రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు తమ గ్రామం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఉంటాయని సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామారావు తో పాటు నాయకులు రామాంజనేయులు, నాగబాబు, అభిరామ్, గంగు మళ్ళ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18, 19వ తేదీలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మల కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి చాగల్లు మండల పరిధిలో పనిచేస్తున్న అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు శిక్షణ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీవో నిర్మల కుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఘనంగా భావనా రుషి ఉత్సవాలు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మండల కేంద్రమైన తాళ్ళపూడి లో పద్మ శాలీయుల కుల ఆరాధ్య దైవం శ్రీ భద్రావతి భవనా రుషి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గత వారం రోజులుగా పుష్కరాల వీధి లో గల భావనా ఋషి ఆలయం వద్ద పూజా కార్యక్రమాల అనంతరం చివరి రోజు బుధవారం భారీ ఊరేగింపు జరిగింది. తీన్ మార్, కోయ డాన్స్, ఖాళీమాత వేషాలు, కోబ్రా డాన్స్, శూలాలు కేరళ వాయిద్యాలు, డాన్స్ లు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా భావనా ఋషికి ఎంతో ప్రీతి అయిన శూలా ధారణ అందర్నీ ఆకట్టుకుంది. మాజీ ఎంపీటీసీ కోదాటి సత్యనారాయణ, ఉడతా వీరేంద్ర, నక్కా చిట్టిబాబు తదితరులు ఉత్సవ కమిటీగా కార్యక్రమాలు చేపట్టారు. స్వగ్రామం లో ఉత్సవాలు నిమిత్తం బంధువులు, స్నేహితులు రాకతో సందడి నెలకొంది.

అధికారుల తీరుపై అంగన్‌వాడీల ఆగ్రహం

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్ర ప్రభుత్వం తమ పై ఒక పక్క కక్షపూరితంగా వ్యవహరిస్తుంటే తమ అధికారులు మరోపక్క వారికి వత్తాసు పలుకుతూ తమ పై చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు సన్నద్ధమయ్యామని అంగన్వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేబీ రాణి అన్నారు. న్యాయపరమైన తమ డిమాండ్ల సాధన కోరుతూ మండల కేంద్రమైన రాజానగరంలోఅంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సాధికారిక నిరవధిక సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా రాజానగరం లోని సిడిపివో కార్యాలయానికి అంగన్వాడీలు సంజాయిషీ పత్రాలు అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పక్కన పెట్టి తమ ఇళ్లకు,అంగన్వాడీ కార్యాలయాలకు రిజిస్టర్ పోస్టుల్లో పంపిన నోటీసులకు బదులుగా తమ సంజాయిషీ లేఖలు ఇచ్చేందుకు రాజానగరం సీడీపీవో కార్యాలయానికి వెళ్లగా వాటిని తీసుకునేందుకు అదికారులు నిరాకరించారన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన అమరణ నిరాహార దీక్షలు,ఇకపై జిల్లాల్లో సైతం ప్రారంభం అవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శిలు ఎం. మార్తమ్మ, వై.సుజాత,ఉండమట్ల వైశాలి,దువ్వ విజయ గంగ,చంద్రావతి, డి.విజయ, కె.విజయ,తదితరులు పాల్గొన్నారు.

20న మండపేటలో రా కదిలి రా

విశాలాంధ్ర - కాకినాడ : ఈనెల 20వ తారీఖున మండపేటలో జరుగు రా కదలిరా సభను జయప్రదం చేయాలని తెలుగుదేశం శ్రేణులకు ప్రజలకు డాక్టర్ చప్పిడి పిలుపునిచ్చారు. ద్రాక్షారామ ప్రతిభా కాలేజ్ వద్ద జరిగిన రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షులు పితాని భద్రం అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సమావేశానికి విచ్చేసిన రామచంద్రపురం రూరల్ మండలంలోని అన్ని గ్రామాల నాయకుల సమన్వయంతో పనిచేసి 20న జరగబోయే సభను జయప్రదం చేయాల్సిందిగా వారికి నిజనిర్దేశం చేశారు.

విధులకు వెళుతూ పారిశుధ్య కార్మికుడి మృతి

విశాలాంధ్ర - సామర్లకోట : మోటార్ సైకిల్ ప్రమాదంలో సామర్లకోట భీమవరం పేటకు చెందిన పారిశుధ్య కార్మికుడు మిరియాల రాజు (45) దుర్మరణం చెందాడు. పోలీసులు, మున్సిపల్ అధికారుల వివరాలు ప్రకారం బుధవారం తెల్లవారు జాము 5 గంటల సమయంలో పారిశుధ్య విధులకు హాజరు అవుతూ మఠం సెంటర్లో రాజు హాజరు వేయించు కున్నాడు. తదుపరి 27వ వార్డు, అమ్మానమ్మా కాలనీల్లో పారిశుధ్య విధులు నిర్వర్తించేందుకు ఆయనకున్న మోటార్ సైకిల్ పై వెళుతుండగా మెహర్ కాంప్లెక్స్ సమీపంలో మోర్ దుకాణం ఎదురుగా మోటార్ సైకిల్‌కు ప్రమాదం జరిగి తలకు బలమైన గాయం తగిలింది. రాజు ముక్కు నుంచి రక్తం కారడంతో అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్య సిబ్బంది ధృవీకరించారు. మృతుడు గత 15 సంవత్సరాలుగా సామర్లకోట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి బార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రాజు మృత దేహాన్ని మున్సిపల్ కమిషనర్ జె రామారావు, వైసీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణ మూర్తి, అబ్బు, రేడ్నం దొరబాబు, కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్, తెదేపా నాయకులు బడుగు శ్రీకాంత్, బలుసు వాసు తదితరులు సందర్శించి మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి సిఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల కాలేజీలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం రూరల్ : స్థానిక తిరుమల విద్యాసంస్థల ఆవరణలో 5 6 7 8 9 10వ తరగతి విద్యార్థిని విద్యార్థు లకు వారి తల్లిదండ్రులకు ఐఐటి, మెడికల్ ఫౌండేషన్ పై అవగాహన సదస్సుకు సుమారు 12,000 మంది హాజరైనట్లు తిరుమల విద్యాసంస్థలు చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు ఇచ్చే ఆస్తి కేవలం విద్య మాత్రమేనన్నారు. దానిని సరైన విధానంలో తమ పిల్లలకు అందించాలని కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచం దేశ వ్యాప్తంగా జరిగే ఇంజనీరింగ్ (జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్) పరీక్షలలో 30 మంది పరీక్ష రాస్తే కేవలం ఒక్కరికి మాత్రమే సీటు దొరుకుతుందని ,అదే తిరుమలలో ప్రతి ఐదుగురిలో ఒకరికి సీటు కచ్చితంగా లభిస్తుందని మెడికల్‌లో దేశవ్యాప్తంగా జరిగే నీట్ పరీక్షల ప్రకారం 16 మంది పరీక్ష రాస్తే కేవలం ఒకరికి సీట్ లభిస్తుందని అన్నారు. ప్రస్తుత పిల్లలందరూ ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ బాగా అలవాటు పడి చదువుల మీద శ్రద్ధ తగ్గిపోతుందని అన్నారు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు దూరంగా ఉంచి వారు భవిష్యత్తు గురించి వారికి వివరముగా తెలియజేయాలని తెలిపారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీ దేవి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని పిల్లలు నడవడిక అభివృద్ధిలో తల్లి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. ప్రతి తల్లి తమ పిల్లలకు వెలుగులతో కూడిన విద్యను ఒక అందించే ప్రయత్నం చేయాలని తెలిపారు రెండు తెలుగు ఏపీ సెట్ తెలంగాణ ఎంసెట్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ అయిన బి. జస్వంత్ బాబాయ్ సుబ్రహ్మణ్యం ఐఐటి చెన్నై విద్యార్థి సంజనాల తల్లి శిరీష, ఐఐటి హైదరాబాద్ విద్యార్థి సుబేద్ తల్లి సురేఖ పాల్గొని తిరుమల విద్యాసంస్థలతో వారికున్న అనుభవాలను సదస్సుకు విచ్చేసిన తల్లిదండ్రులతో పంచుకున్నారు . ఈ సదస్సులో అకాడమీ డైరెక్టర్ జి. సతీష్ బాబు ప్రిన్సిపల్ వి. శ్రీహరి మరియు విద్యార్థుల వారి తల్లిదండ్రులు, తిరుమల అధ్యాపక బృంద సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

విశాలాంధ్ర - గండేపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయని రాష్ట్ర టీడిపి ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గండేపల్లి మండలం ఎన్టి రాజాపురం గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని పరిమి వీర్రాజు అన్నపూర్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ సొసైటీ అధ్యక్షులు పరిమి బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి మంగళవారం సాయంత్రం ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్ క్రీడా పోటీల్లో జిల్లా నలు మూలల నుండి సుమారు 30 టీమ్‌లు పాల్గొన్నాయన్నారు అన్నారు. ప్రథమ స్థానం రాజానగరం మండలం కానవరం టీం వారికి 20 వేలు, రెండో స్థానంలో రాజానగరం మండలం నరేంద్రపురం టీంకు 10 వేలు, మూడో స్థానంలో ఎన్టి రాజా పురం టీమ్‌కు 10 వేలు, నాలుగో స్థానంలో కిర్లంపూడి మండలం సోమవరం టీమ్‌కు 5 వేలు రూపాయల నగదును, అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, కుంచే రాజా, పోతుల మోహన్ రావు, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, పాలచర్ల సత్యనారాయణ, అడబాల ఆంజనేయులు, దొమ్మా శ్రీను, సుంకవల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం గ్రామం పైడి మల్లమ్మ గుడి వీధి కాపురస్తులు **చెన్ను లక్ష్మీ నారాయణ గారి కుమారుడు చెన్ను రాంబాబు** అనువారికి చెందిన సర్వే **నెం.325/5**లో చ.గ **59.5**లు గల ఖాళీ నివేసన స్థలమునకు చెందిన దాక్యుమెంటు **నెం.1474/2015**నకు లింకు దాక్యుమెంటు అయిన **నెం. 3085/2013** గల క్రయదస్తావేజు ది. **04-12-2023**వ తేదీన ఏలేశ్వరం నుండి యర్రవరం గ్రామమునకు చెన్ను **రాంబాబు గారు** ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా మార్గమధ్యంలో ఎక్కడో పడిపోయినది. ఎవరికయినా దొరికిన ఎడల క్రింది అడ్రస్సుకి తెలియపరచవలెను.

అడ్రస్ : చెన్ను రాంబాబు,
డోరు నెం.7-185/2, పైడి మల్లమ్మ గుడి వీధి, ఏలేశ్వరం, ఏలేశ్వరం మండలం,
కాకినాడ జిల్లా -533429.
సెల్ నెం: 9550723199

విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

అంగన్వాడీల నిరవధిక సమ్మె

37వరోజు కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన

విశాలాంధ్ర - కొవ్వూరు రూరల్ :అంగన్వాడీలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని తదితర డిమాండ్లతో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటీయు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు 37వ రోజు సమ్మె కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన శిబిరాన్ని కొనసాగించారు.ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. మాణిక్యంబ, సిఐటీయు జిల్లా అధ్యక్షులు ఏం.సుందర బాబు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలలో నిత్యవసర సరుకులు ధరలు భారీగా పెరిగాయని పెరిగిన కరువు భత్యం పాయింట్లు లెక్క కట్టిన 469 పాయింట్లుకు 3630 రూపాయల చెల్లించాల్సి ఉందని ముఖ్యమంత్రి వాగ్దానం చేసినట్లు తెలంగాణ అంగన్వాడీల కంటే వెయ్యి రూపాయలు అదనంగా చెల్లిస్తామని చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పి.సి హెచ్.బ్రహ్మమ్మ ఏ.నరసింహంబ, బి.వి.పద్మజ, బి.మధురవల్లి, ఎల్.వరలక్ష్మి, బి.నాగమణి కే.సి.లక్ష్మి కె.వి.అరుణ ఎస్.ఉషా లక్ష్మి ఎన్.శాంతకుమారి పి.చైతన్య తదితరులు నాయకత్వం వహించారు.

ఆలయానికి రూ. 7 లక్షల విరాళం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి దేవరపల్లికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు తీగల బలరామయ్య ఆలయ అభివృద్ధికి 7 లక్షల రూపాయలతో వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం టైల్స్ నిమిత్తం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన దాత తీగల బలరామయ్య ఆలయ అభివృద్ధికి ఏడు లక్షల రూపాయలు ఇవ్వడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు ఈ సందర్భంగా దాత తీగల బలరామయ్యను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకర సుబ్రహ్మణ్యం, గుడ్ల వెంకటేశ్వరరావు, చిట్లు వెంకటేశ్వరరావు, యాగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : తాళ్ళరేవు మండలం పి. మల్లవరం గ్రామంలో శ్రీ శ్రీ ముత్యాలమ్మ వారి ఆలయ ప్రాంగణంలో “ఆప్త” (అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) ట్రెజరర్ ధూళిపూడి సురేష్ సహకారంతో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతిగా మిక్సీ, రెండవ బహుమతి నాన్ స్టిక్ పాన్ సెట్, మూడవ బహుమతి వాటర్ ఫిల్టర్, నాల్గవ బహుమతి కుక్కర్ (5 లీ), ఐదవ బహుమతి (3 లీ), పాల్గొన్న అందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ధూళిపూడి శేఖర్ (శ్రవంతి), పాలూరి రామకృష్ణ (హైదరాబాద్), అడబాల బాబి, వలవల గోవిందు, నాగబాబు, కొమ్మిరెడ్డి రాజేష్ గాంధీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ (బాబి), విళ్ళ సత్యన్నారాయణ, అంబేద్కర్, దున్నా సుబ్రహ్మణ్యం, మురళి, దడాల సత్తికొండ, ధూళిపూడి సుబ్రహ్మణ్యం, ముత్యాల జయశ్రీ, రాధిక, సుభ, గంగ, పద్మ, పితాని సత్యవతి, వెంటపల్లి సత్యవతి, దున్నా సింహాద్రి, వుంగరాల బిందు, తదితరులు పాల్గొన్నారు.

1993-94 విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: విద్య నేర్పిన గురువులకు మూడు దశాబ్దాల అనంతరం సన్మానించడం నాటి విద్యార్థులకున్న గురుభక్తి తెలియజేస్తుందని సన్మాన గ్రహీతలు పేర్కొన్నారు. మండలంలోని సూర్యారావుపాలెం లో బుధవారం 1993-94 ఏడవ తరగతి బ్యాచ్ అపూర్వ కలయిక జరిగింది. నాటి విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు సుమారు 120 మంది ఈ కార్యక్రమంలో ఆటపాటలతో, నాటి ముచ్చట్లతో, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సంక్రాంతి సెలవులు కావడంతో గత మూడు రోజులుగా గ్రామాలలోనే ఉన్నప్పటికీ, ఒకే దగ్గర కలవడం ఆనందంగా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో ఏవి రమణారావు, నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, అయినపర్తి రాజగోపాల్, రాపాక ఏసుబాబు తదితర గురువులకు శాలువా కప్పి సన్మానం చేశారు. మాజీ సర్పంచ్ వల్లేపల్లి వెంకట సుబ్బారావు, ప్రస్తుత సర్పంచ్ మెండే లలిత కుమారి, ఉప సర్పంచ్ నందిన శ్రీనివాస్, మెండే శ్రీనివాస్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి హై స్కూల్లో 1998-2003 సంవత్సరంలో విద్యను అభ్యసించినటువంటి విద్యార్థి, విద్యార్థినులు జాతీయ రహదారి ప్రక్కన శుభప్రద్ ఫంక్షన్ హాలులో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంవత్సరకాలంలో చదువుకున్న విద్యార్థులు విద్యార్థినులుతో పాటు ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, నాగరాజు, గిరిధర్, రాంబాబు, అప్పన్న, ఉపాధ్యాయురాలు మోహినీ, సాయి లక్ష్మిలు పాల్గొన్నారు. 20 సంవత్సరాల తరువాత మళ్ళీ స్కూల్‌లో చదివిన విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి మధుర స్మృతులను గుర్తుచేసుకోవడం చాలా ఆనందంగా వుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదవ తరగతి 20 సంవత్సరాల దాటిన వయసులో ఆత్మీయ కలయిక అపూర్వకంగా ఉందని అన్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విద్యార్థులతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దార్లంక భద్రం, వంగలపూడి నాగేంద్ర, కోడూరి ప్రసాద్, గొర్రెల హేమంత్, తమటం శ్రీను, గొల్లవిల్లి అర్జున్, వెలుచూరి నాగు, పూర్వపు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా పోలీసుల విస్తృత దాడులు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలలో కోడిపందాల బరులు, గుండాటలపై దాడులు చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేశారు. కోడిపందాలు, గుండాట వంటి జూదాల నిర్వహణ అడ్డుకొని టెంట్లను తొలగించి జూదాల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడిపందాలు నిర్వహిస్తున్న ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించి నిర్వాహకులపై 289 కేసులు నమోదు చేసినటట్టు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించిన జిల్లా పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.